# సాక్షి హనుమకొండ

సోమవారం । 20 । నవంబర్ । 2023






## నగదుపై నజర్..

- రూ.లక్ష పరిమితి దాటితే లెక్క చెప్పాలి
- ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా..!

- 10లో▸



## దోచుకోవడమే కాంగ్రెస్ విధానం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అవినీతి ఎక్కువవుతుందని.. దోచుకోవడం, దాచుకోవడమే ఆ పార్టీ విధానమని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/20^0$

## వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండగా ఉంటుంది. రాత్రి పూట చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### నేడు ఘన్‌పూర్‌కు సీఎం కేసీఆర్ రాక



**స్టేషన్‌ఘన్‌పూర్:** ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి రానున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన్‌పూర్ మండలం చాగల్లు శివారు శివారెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని పార్టీ అభ్యర్థి కడియం శ్రీహరి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సీఎం హెలికాప్టర్‌లో ఇక్కడికి చేరుకుంటారని, సభాస్థలి, హెలిపాడ్ వద్ద అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. సభకు లక్ష మందికి పైగా ప్రజలు హాజరవుతున్నట్లు వివరించారు.

### నేడు పరకాలలో కాంగ్రెస్ ప్రచార సభ

- హాజరుకానున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

**పరకాల:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరకాల పట్టణంలో సోమవారం(నేడు) మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న ప్రచార సభకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. రేవంత్‌రెడ్డి వచ్చే హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం హెలిపాడ్ అనుమతి లభించక రాత్రి వరకు సందిగ్ధంలో పడ్డారు. పరకాల వ్యవసాయ మార్కెట్ హెలిపాడ్ ప్రాంగణంలో ధాన్యం ఆరబోశారు. వాటిని తీసేందుకు రైతులు నిరాకరించడంతో అధికారులు హెలిపాడ్‌కు అనుమతి ఇవ్వలేదు. చివరకు లలిత కన్వెన్షన్ హాల్ వద్ద అనుమతి లభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. వెల్లంపల్లి రోడ్డులో సభ ఏర్పాట్లను కాంగ్రెస్ నాయకులు చేపట్టారు.


### 6నుంచి ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్షలు

**కేయూ క్యాంపస్:** కేయూ పరిధి ఎస్‌డీఎల్‌సీ (దూరవిద్య) ఎమ్మెస్సీ మొదటి సంవత్సరం పరీక్షలు ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ తెలిపారు. డిసెంబర్ 6న పేపర్-1 కాన్సెప్ట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, 8న పేపర్-2 ఎకోసిస్టమ్ ఎకలాజీ, 12న పేపర్-3 ఎన్విరాన్‌మెంటల్ స్టాటిస్టిక్స్ కంప్యూటేషన్ డెమోగ్రఫీ అండ్ ఎకనామిక్స్, 14న పేపర్-4 ఎన్విరాన్‌మెంటల్ టాక్సికాలజీ అండ్ మానిటరింగ్ పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

**ఫైనల్ ఇయర్ పరీక్షలు..**
కేయూ పరిధి దూరవిద్య ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ ఫైనల్ ఇయర్ పరీక్షలు డిసెంబర్ 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ తెలిపారు. డిసెంబర్ 7, 11, 13, 15, 18 తేదీల్లో పరీక్షలు ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని వారు పేర్కొన్నారు.

### ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

- దివ్యాంగ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్



**విద్యారణ్యపురి:** ఎన్నికల విధుల నుంచి దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ఆసంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల కమిషన్ ఆదేశాలను పట్టించుకోకుండా జిల్లా అధికారులు దివ్యాంగులంతా విధులు నిర్వర్తించాలని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మినహాయింపు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎండీ అబ్దుల్‌హై, ఏఓ గౌరిశంకర్‌కు వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. సమావేశంలో ఆ సంఘం కార్యదర్శి ఆత్మకూరి రామకృష్ణ, రాష్ట్ర బాధ్యులు బొనగిరి రాములు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, టీపీఆర్టీయూ బాధ్యులు మన్నెం చంద్రయ్య, ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీనివాస్, ధనుంజయ్, చక్రపాణి, ధనలక్ష్మి, శ్రీకాంత్, లింగయ్య, రాధిక, సంగీత, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# వాహనాల జోరు.. ప్రచార హోరు

**గొంతు చించుకుంటున్న ప్రచార రథాల మైకులు!**

- వాడవాడలా వాహనాలతో విస్తృత ప్రచారం
- ఆకర్షిస్తున్న డిజిటల్ స్క్రీన్‌లు
- ఆకట్టుకుంటున్న కళాకారుల ఆటపాటలు

ఎలాగైనా జెండా ఎగురవేయాలన్నదే అన్ని పార్టీల ఎజెండా. ఇందు కోసం అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వివిధ రూపాల్లో ప్రచారం కొనసాగిస్తున్నారు. ప్రజల్లోకి తమ పంథాను తీసుకెళ్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయా పార్టీల ప్రచార సరళిపై 'సాక్షి' ప్రత్యేక కథనం. - హన్మకొండ అర్బన్

**నియోజకవర్గాల వారీగా ప్రచారం కోసం అనుమతి పొందిన వాహనాలు**

| నియోజకవర్గం | బీఆర్ఎస్ | కాంగ్రెస్ | బీజేపీ | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| జనగామ | 54 | 39 | 22 | 6 | 121 |
| స్టేషన్‌ఘన్‌పూర్ | 52 | 46 | 30 | 221 | 349 |
| పాలకుర్తి | 25 | 16 | 19 | 4 | 64 |
| డోర్నకల్ | 14 | 17 | 2 | 6 | 39 |
| మహబూబాబాద్ | 22 | 14 | 17 | 4 | 57 |
| నర్సంపేట | 26 | 27 | 08 | 10 | 71 |
| పరకాల | 16 | 15 | 30 | 13 | 74 |
| వరంగల్ పశ్చిమ | 8 | 14 | 23 | 15 | 60 |
| వరంగల్(తూ) | 17 | 28 | 23 | 7 | 75 |
| వర్ధన్నపేట | 16 | 23 | 23 | 4 | 66 |
| భూపాలపల్లి | 28 | 18 | 11 | 11 | 68 |
| ములుగు | 15 | 17 | 15 | 05 | 52 |
| మొత్తం | 296 | 274 | 202 | 306 | 1078 |




నామినేషన్ల పర్వం ముగిసింది. పోలింగ్ తేదీ ఇంకా పది రోజులే ఉంది. ఏ లెక్కన చూసినా అభ్యర్థులు ఓటర్లను ముఖాముఖి కలిసే పరిస్థితి లేదు. దీంతో వాహనాల్లో మైక్‌సెట్లు, డీజేలు, కళాకారుల పాటల ద్వారా ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మొత్తం 12 నియోజకవర్గాల్లో అన్ని పార్టీలు కలిపి వెయ్యికిపైగా ప్రచార వాహనాల కోసం అనుమతులు తీసుకున్నాయి. వాటిలో అధికార పార్టీ వాహనాల సంఖ్యే కాస్త ఎక్కువ. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రచారం, ర్యాలీలు, హెలికాప్టర్ వంటి వాటిని పార్టీ పనుల కోసం సువిధ యాప్ ద్వారా అనుమతులు తీసుకోవాలని నిబంధనలు ఉండడంతో అందరూ అలాగే చేస్తున్నారు. ఇంకొందరి దరఖాస్తులు ఆర్‌ఓల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

**హోరెత్తిస్తున్న ప్రచార రథాలు**
ఎన్నికల వేళ.. ప్రచారం పలు విధాలుగా జరుగుతోంది. కానీ.. అన్ని ప్రధాన పార్టీల్లోనూ కామన్ థింగ్ 'ప్రచార రథం'.. తెల్లారింది మొదలు రాత్రి వరకు ఆయా పార్టీల ప్రచార వాహనాలు గల్లీలన్నింటినీ చుట్టేస్తున్నాయి. ఒక్కో వీధిలో రోజుకు ఏడెనిమిదిసార్లు చక్కర్లు కొడుతున్నాయి. అభ్యర్థుల పేర్లతో, ఆకట్టుకునే పాటలతో ప్రచారం సాగిస్తున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ తాము చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్ని వివరిస్తూ వాహనాల ద్వారా ప్రచారం నిర్వహిస్తోంది. బీజేపీ.. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన నిధులు, స్థానికంగా చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. ఆయా అభ్యర్థుల గుణగణాలతో ప్రచారంలో దూసుకెళ్తోంది. కాంగ్రెస్ ప్రధానంగా ఆరు గ్యారెంటీలను తెలుపుతూ.. అండగా నిలవాలని ప్రచారం కొనసాగిస్తోంది.

**కళ్లకు కట్టినట్లుగా..**
దృశ్య రూపంలో చూసింది ఎక్కువగా గుర్తుంటుందనే సిద్ధాంతాన్ని నాయకులు గట్టిగా పట్టుకున్నారు. వీడియోలను ప్లే చేస్తూ ప్రజల మెదళ్లలోకి ఎక్కించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయా పార్టీలు చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన పథకాలు, అమలు చేయబోయే హామీలను, అభ్యర్థుల గొప్పదనాన్ని తెలిపేలా వాహనాలకు భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నాయి. ఈ వాహనాలు రద్దీ ఎక్కువగా ఉండే ఏరియాల్లో కూడళ్లలో నిలిపి స్క్రీన్లపై వీడియోలు చూపిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం ఈ స్క్రీన్ల ద్వారా ప్రజల్ని ఎక్కువగా ప్రభావితం చేయడంలో నాయకులు సఫలీకృతులవుతున్నారు.

**గజ్జె కట్టి.. చిందులేసి**
ఆయా పార్టీలు ఓటు అభ్యర్థించడం కోసం కూడళ్లలో కళాకారులతో పాటలు పాడిస్తున్నాయి. కళాకారులు కాలికి గజ్జె కట్టి, గోచి, గొంగడి వేసి కదం తొక్కుతూ పాటలు పాడుతున్నారు. పార్టీ ప్రాధాన్యాన్ని ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్తున్నారు. ఇరువైపులా ఆయా పార్టీలు పెద్ద పెద్ద ఫ్లెక్సీలు అమర్చి ఒక వైపున స్టేజీ మాదిరిగా డీసీఎం వాహనాన్ని తయారు చేసి కళాకారులు పార్టీ ప్రచారం నిర్వహిస్తున్నారు. కళాకారులు ప్రధానంగా రద్దీ ఉండే ఏరియాల్లో ఆటపాటల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

## ● వివాహ వేడుకల్లో క్రికెట్ జోష్..



ఓ వైపు వివాహం.. మరో వైపు ఉత్కంఠభరితంగా సాగుతున్న ఇండియా- ఆస్ట్రేలియా క్రికెట్ ఫైనల్ మ్యాచ్. పెళ్లికి వచ్చిన బంధుమిత్రులు వీక్షించడానికి ఏకంగా ఎల్‌ఈడీ టీవీ ఏర్పాటు చేశారు. వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు శివారు హెచ్‌ఆర్‌ఎస్ గార్డెన్స్‌లో ఆదివారం రంగశాయిపేటకు చెందిన శ్రావ్య–శివగౌడ్ వివాహ వేడుకల్లో ఈ దృశ్యం కనిపించింది. - మామునూరు

# యువ ఓటర్ల పాత్ర కీలకం

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఉత్సాహంగా 'స్వీప్' కప్ క్రికెట్ పోటీలు

**హన్మకొండ:** ప్రజాస్వామ్యంలో యువ ఓటర్ల పాత్ర కీలకమని.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఆదివారం హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో స్వీప్ కప్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య క్రీడాకారులను పరిచయం చేసుకుని బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో హనుమకొండ హంటర్స్ జట్టు వరంగల్ వారియర్స్ జట్టుపై విజయం సాధించి ట్రోఫీ గెలుచుకుంది. ఈమ్యాచ్‌లో పలువురు అధికారులు ఆడగా.. హనుమకొండ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాహుల్ పంజాబ్‌రావు గవాండే 26 బంతుల్లో 45 పరుగులు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డాక్టర్ హెచ్‌ఎస్.గోపాలకృష్ణ, పోలీస్ అబ్జర్వర్ తోగాకర్గా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, జీఎం ఇండస్ట్రీస్ హరిప్రసాద్, డీసీపీ జగదీశ్, స్పోర్ట్స్ అధికారి అశోక్ పలువురు అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

**హోమ్ ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి**
**కాజీపేట:** హనుమకొండ జిల్లా పరిధి వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో ఈనెల 21, 22, 23 తేదీల్లో హోమ్ ఓటింగ్‌కు ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమలో 11 బృందాలు, పరకాలలో ఆరు బృందాలు పని చేస్తాయని అన్నారు.



ట్రోఫీతో హనుమకొండ హంటర్స్ జట్టు



క్రికెట్ ఆడుతున్న కలెక్టర్లు సిక్తా, ప్రావీణ్య

## కార్తీక పురాణం చదివితే సకలశుభాలు



దేవాలయ ప్రాంగణంలో కార్తీక వన భోజనాలు



దేవాలయంలో సహస్ర లింగార్చన

- రుద్రేశ్వరాలయ ప్రధానార్చకులు ఉపేంద్రశర్మ
- ఘనంగా ఉసిరిక పూజలు, కార్తీక వనభోజనాలు

**హన్మకొండ కల్చరల్:** శివకేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసంలో కార్తీకపురాణం చదివినా, విన్నా సకల శుభాలు కలుగుతాయని, కార్తీక వనభోజనం ఆచరించడం ఆరోగ్యదాయకమని వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. ఆదివారం వేయిస్తంభాల ఆలయంలో ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంచికట్ల గోపీనాథ్ దంపతుల సౌజన్యంతో ఆలయ ప్రాంగణంలో ఉసిరిక పూజలు, కార్తీకసమారాధన నిర్వహించారు. వందలాది మంది భక్తులు కార్తీక వనభోజనాల్లో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. పూజల్లో తెలంగాణ జైళ్ల శాఖ ఐజీ రాజేశ్ పాల్గొన్నారు. సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో పుట్టమట్టితో తయారు చేసిన శివలింగాలకు ఆవుపాలతో, గంధోదకములతో సహస్రలింగార్చన నిర్వహించారు. ప్రముఖ పురాణప్రవచకులు సోమశేఖరశర్మ కార్తీకపురాణంలోని కార్తీకమహత్యాన్ని వివరించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించారు.

## వైన్స్ వద్దని మహిళల నిరసన

**ఖిలా వరంగల్:** వరంగల్ ఫోర్ట్‌రోడ్డు శివనగర్ రుద్రమాంబనగర్‌లోని సాయిబాబా గుడి సమీపంలో జనావాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయొద్దని స్థానిక మహిళలు నిరసన వ్యక్తం చేశారు. జనావాసాల మధ్య వైన్‌షాపునకు ఎక్సైజ్‌శాఖ అనుమతులు ఇవ్వొద్దంటూ వైన్స్ ఏర్పాటు చేయనున్న స్థలం వద్దకు ఆదివారం ఉదయం స్థానిక మహిళలు పెద్ద ఎత్తున చేరుకుని ఆందోళన చేపట్టారు. ఫోర్ట్ రోడ్డుపై వైన్స్‌కు ఇచ్చే అనుమతులను తక్షణమే ఉపసంహరించుకుని స్థానిక మహిళలను కాపాడాలంటూ రుద్రమాంబనగర్ పరపతి సంఘం ప్రతినిధులు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక మహిళా ప్రతినిధులు జారతి దేవి, బజ్జూరి సునిత మాట్లాడుతూ.. సాయిబాబా మందిరం సమీపాన నిత్యం రద్దీగా ఉంటుందని, సరైన పార్కింగ్ ప్లేస్ లేదని, జనవాసాల నడుమ మద్యం షాపు ఏర్పాటు కోసం ఇచ్చిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మడిపోజు మణెమ్మ, ధనలక్ష్మి, మమత, కృష్ణవేణి, బజ్జూరి సునీత, చింతల సుజాత, భారతి రమ, హరిత, కడాల సరస్వతి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న స్థానిక మహిళలు

## సింథటిక్ ట్రాక్‌పై క్రికెట్

**హన్మకొండ:** హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సుమారు రూ.7.30 కోట్లతో నిర్మించిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ను క్రికెట్ పిచ్‌గా మార్చేశారు. యువ ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ఆదివారం స్వీప్–23, సీ విజిల్ యాప్ ఆధ్వర్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికార యంత్రాంగం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించింది. పాల్గొనేందుకు వచ్చిన యువత ఆటకు ముందు సింథటిక్ ట్రాక్‌పై ప్రాక్టీస్ చేసింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన ఈట్రాక్‌పై అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల నిర్వహణ, అథ్లెట్లు సాధన మాత్రమే చేయాలి. అప్పుడే ట్రాక్ దెబ్బతినకుండా మన్నికగా ఉంటుంది. ట్రాక్‌పై క్రికెట్ ప్రాక్టీస్ చేయడంపై యువ అథ్లెట్లు అసహనం వ్యక్తం చేశారు. క్రీడాధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి.



సింథటిక్ ట్రాక్‌పై సాధన చేస్తున్న యువత

# మద్యం ప్రవాహం..

**కమిషనరేట్ పరిధిలో రూ.33,75,850 విలువైన మద్యం పట్టివేత**

- 429 మంది అరెస్ట్
- పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు
- వివిధ కేసుల్లో 7,600 మంది బైండోవర్

**వరంగల్ క్రైం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇంతకాలం గుట్టుచప్పుడు కాకుండా సాగిన మద్యం (బెల్ట్ షాపుల) వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం తనిఖీల్లో బెల్ట్ షాపుల్లో దొరుకుతున్న మద్యాన్ని చూసి పోలీస్ అధికారులే ఆశ్చర్యపోతున్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా.. ఇంత కాలం పోలీస్ అధికారులు ఏం చేశారనే ప్రశ్న వెల్లువెత్తుతోంది. రాష్ట్ర ప్రభుత్వం 2016లో తెలంగాణలో గుడుంబాపై నిషేధం విధించింది. కానీ.. ప్రస్తుతం పోలీసుల తనిఖీల్లో క్వింటాళ్ల కొద్ది నల్ల బెల్లం పట్టుబడుతోంది. పోలీస్ ఉన్నతాధికారుల సమీక్షల్లో ప్రతీసారి ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. అధికారులు పెడచెవిన పెడుతూనే ఉన్నారు. ఇప్పుడు మాత్రం పెద్ద మొత్తంలో మద్యం పట్టుకోవడం గమనార్హం.

**పట్టుబడిన మద్యం 6,258 లీటర్లు**
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు గత నెల 9 నుంచి ఈ నెల 15 వరకు 6,258 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. దాని విలువ రూ.33,75,850. దీంతో పాటు రూ.9,96,870. 16,900 కిలోల నల్లబెల్లాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపుల్లో మద్యం అమ్ముతున్నందుకు 420 మందిని అరెస్టు చేసి నోటీసులు ఇచ్చారు. బెల్లం కేసుల్లో 9 మందిని అరెస్ట్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత వివిధ కేసుల్లో ప్రమేయం ఉన్న 7,600 మందిని బైండోవర్ చేశారు. దీంతో ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు, పంపిణీ చేసేందుకు తీసుకొచ్చిన రూ.14 లక్షల విలువైన వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకుని 27 కేసులు నమోదు చేశారు. వీటితో పాటు పోలీసు అధికారుల తనిఖీల్లో రూ.3.74 కోట్ల విలువైన 7 కిలోల బంగారం, రూ.1.35 కోట్ల విలువైన 551 కిలోల గంజాయి, నగదు రూ.5.64 కోట్లను పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎక్సైజ్ అధికారులు రూ.1.40 కోట్ల విలువైన మద్యం, బెల్లాన్ని పట్టుకున్నారు.

**విచ్చలవిడిగా అమ్మకాలు**
పోలీసుల తనిఖీల్లో పెద్ద మొత్తంలో మద్యం పట్టుబడుతున్నా.. పోలీసులకు చిక్కని మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికల సందర్భంగా ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం అనంతరం పార్టీ కార్యకర్తలకు రాత్రి సమయంలో పెద్ద ఎత్తున మద్యం సరఫరా చేస్తున్నట్లు ప్రచారం. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్‌షాపుల నిర్వాహకులు పెద్ద మొత్తంలో మద్యం తీసుకొచ్చి వారి బంధువుల ఇళ్లలో దాచి కొద్ది కొద్దిగా అమ్ముతున్నట్లు తెలిసింది.



**సామాన్యుల నగదు పట్టివేత**
పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న మొత్తం నగదులో సామాన్యులకు చెందినదే ఎక్కువ ఉండడం గమనార్హం. రాజకీయ పార్టీల నేతలు చేరాల్సిన చోటుకు నగదును గుట్టు చప్పుడు కాకుండా ఇప్పటికే చేర్చినట్లు ప్రచారం సాగుతోంది. వ్యాపారులు వ్యాపారం అనంతరం ఇంటికి డబ్బులు తీసుకెళ్తుంటే పట్టుకోవడం, వాటికి సరైన ఆధారాలు చూపిన తర్వాత విడిచిపెట్టడం ఇటీవల సాధారణంగా మారింది. పార్టీల డబ్బులు పట్టుకోకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

### పట్టుబడుతున్న మద్యం

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసుల తనిఖీల్లో ఆయా పోలీస్‌స్టేషన్ల ఏరియాల్లో పెద్ద ఎత్తున మద్యం పట్టుబడింది.

- రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 14న కంచనపల్లిలో అమృతం అంజయ్య ఇంట్లో రూ.94,830 విలువైన మద్యం పట్టుబడింది. చిల్పూరు పోలీస్‌స్టేషన్ పరిధి వెంకటేశ్వర్లపల్లిలో సుంకరి సాంబరాజు ఇంట్లో రూ.14,560 మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- ఈనెల 11న హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధి ముచ్చెర్లలో ఎండీ హుస్సేన్ బాబా ఇంట్లో రూ.42,920 విలువైన మద్యాన్ని పోలీస్ అధికారులు పట్టుకున్నారు. ఇదే రోజు దేవరుప్పుల పోలీస్‌స్టేషన్ పరిధి కోలుకొండలో కన్నే ప్రశాంత్ ఇంట్లో రూ.9,660 విలువైన మద్యాన్ని పట్టుకున్నారు. ఐనవోలు పోలీస్‌స్టేషన్ పరిధి వనమాల కనిపర్తిలో కారేనుగుల కృష్ణవేణి ఇంట్లో రూ.14,680 విలువైన మద్యాన్ని పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- ఈనెల 10న బచ్చన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధి కట్కూర్‌లో ముసిని వెంకటయ్య ఇంట్లో రూ.82,490 విలువైన మద్యాన్ని పట్టుకున్నారు. ఇదే రోజు పాలకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధి గుడురులో చిక్కుడు అనిల్ ఇంట్లో రూ.10,820 విలువైన మద్యాన్ని పట్టుకున్నారు.
- ఈనెల 9న పరకాల పోలీస్‌స్టేషన్ పరిధి లక్ష్మీపురంలో అమడలపల్లి రాకేశ్ ఇంట్లో రూ.12,720 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- ఈనెల 7న సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి దీన్‌దయాళ్‌నగర్‌లో గజ్జికొండ వీరేశ్ ఇంట్లో రూ.11,920 విలువైన మద్యాన్ని పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇదే రోజు వరంగల్ బస్టాండ్ సమీపంలో రుద్రాక్షి మెస్‌లో రూ.17,160 విలువైన మద్యాన్ని పట్టుకున్నారు.
- ఈనెల 6న జఫర్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధి వెంకటాపురంలో బత్తిని వెంకటలక్ష్మి ఇంట్లో రూ.19,650 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదే రోజు గీసుకొండ పోలీస్‌స్టేషన్ పరిధి చంద్రయపల్లిలోని గోపతి కుమారస్వామి ఇంట్లో రూ.9,600 విలువైన మద్యాన్ని పోలీస్ అధికారులు పట్టుకున్నారు.
- ఈనెల 5న హనుమకొండలోని కుమారపల్లిలో హిల్ల మోనా ఇంట్లో రూ.73,970 విలువైన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- ఈనెల 4న నిరుప్‌నగర్‌లో బుక్య కిషన్ ఇంట్లో రూ.15,740 విలువైన మద్యాన్ని పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- ఈనెల ఒకటో తేదీన ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధి పెద్దాపురం గ్రామంలో మోతె విజయ్‌కి చెందిన ఇంట్లో రూ.21,495 విలువైన మద్యాన్ని పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



జంగ్ తెలంగాణ

## బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్‌లో బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి ఓట్లు అభ్యర్థించారు.



## కొబ్బరి బొండా కొట్టు.. ఓటు పట్టు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోత్ హుస్సేన్ నాయక్ తరఫున ఆయన సతీమణి జమున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ షాపులో కొబ్బరి బొండా కొట్టి హుస్సేన్ నాయక్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. - మహబూబాబాద్ అర్బన్



## చిన్నారిని ఆడిస్తూ.. ఓట్లు అడుగుతూ..

బీఆర్‌ఎస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి ఆదివారం మొగుళ్లపల్లి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగాపూర్‌లో చిన్నారి దేవాన్ష్ గౌడ్‌ను ఎత్తుకుని ఆడిస్తూ గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు. - మొగుళ్లపల్లి

### ఈ ముచ్చటెరికేనా ?

## ప్రలోభాలకు గురి చేస్తే కఠిన శిక్ష ..



కాజీపేట: నామినేషన్ల ఉపసంహరణ పర్వం పూర్తయి ప్రచారం ఊపందుకోవడంతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల వేడి మొదలైంది. మద్యం, డబ్బు పంపిణీతో పాటు కుల రాజకీయాలు చేయడంలో నాయకులు తలమునకలయ్యారు. అయితే దొరికితేనే దొంగ అన్నట్లు ప్రస్తుత పరిస్థితులు మారాయి. అయినా ఎన్నికల కమిషన్ సిబ్బంది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిఘా పెంచింది. ఓటర్లను ప్రలోభ పెట్టే పార్టీలకు అడ్డుకట్ట వేయడానికి కఠిన నిర్ణయాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాష, సమాజం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడితే సెక్షన్ 125 ఆర్పీ చట్టం 1851, 153ఏ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. అలాగే, ఓటు కోసం మద్యం, డబ్బు, ఇతర వస్తువులు ఇచ్చినా తీసుకున్న ఇద్దరు నేరస్తులే. సెక్షన్ 171బీ, 171ఇ, 171 హెచ్‌బీ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది కాలం జైలు శిక్ష విధిస్తారు. కాగా, ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు నిజాయితీ కలిగిన నాయకులనే ఎన్నుకోవాలి. ప్రలోభాలకు గురి చేస్తూ పట్టుబడితే భారీ మూల్యం తప్పదని గుర్తు పెట్టుకోవాలి.

కాజీపేటలో స్వెటర్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



## స్వెటర్లు వచ్చేశాయ్..

కాజీపేట : శీతాకాలం సీజన్ వచ్చింది. చలి తీవ్రత పెరుగుతోంది. నవంబర్ రెండో వారం నుంచే చలిగాలుల తీవ్రత ఎక్కువైంది. దీంతో నగరంలో స్వెటర్లు (చలికోట్లు) విక్రయించే దుకాణాలు విరివిగా వెలిశాయి. గరంకోట్లు, చేతులకు గ్లౌజులు, దుప్పట్లు, తల రక్షణకు అవసరమైన దుస్తులను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. రూ.50 నుంచి రూ.వెయ్యి దాకా ధరల్లో కావాల్సిన దుస్తులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని వరంగల్ ఎంజీఎం సెంటర్, అశోకా జంక్షన్‌లోని మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దుకాణాల్లో వినియోగదారులు కొనుగోళ్లు చేస్తున్నారు.



# నగదుపై నజర్..

### రూ. లక్ష పరిమితి దాటితే లెక్క చెప్పాల్సిందే..

- ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా..!
- బ్యాంకు ఖాతాలపై ప్రత్యేక దృష్టి



ఖిలా వరంగల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బ్యాంకు ఆన్‌లైన్ లావాదేవీలపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది. పరిమితి దాటితే లెక్క చెప్పాల్సిందేనని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే పోటాపోటీ ప్రచారాలు మొదలయ్యాయి. దీంతో డబ్బు వరదలా పారుతోంది. మందు, విందుతోపాటు శ్రేణులను స్వయంగా వాహనాల్లో ఎక్కించుకుని ప్రచారానికి తీసుకెళ్లడం, తిరిగి వారిని ఇంటి దగ్గర దింపడం వంటివి కూడా సహజం. సాంకేతిక పరిజ్ఞానం (ఆన్‌లైన్ పేమెంట్) అందుబాటులోకి రానంత వరకు అధికార, ప్రతిపక్షాలు అనే తేడా లేకుండా డబ్బులివ్వడం పైనే ఆధార పడే వారు. దీని వల్ల ప్రత్యర్థి పార్టీలకు విషయం తెలిసి తీవ్ర ఆందోళనకు దిగే వారు. తద్వారా కొన్ని సార్లు గొడవలు కూడా జరిగేవి. ఇప్పుడా అవస్థ లేదు. ఆన్‌లైన్ చెల్లింపులు షురూ చేస్తున్నారు. అయితే ఇక్కడా కొంత పరిమితి వరకే అనుమతి ఉంది. ఫోన్ పే, గూగుల్‌పే, ఇతర చెల్లింపులు మీద రూ. లక్ష దాటితే లెక్క చూపాల్సిందే. అయితే ఇక్కడే నేతలు తెలివి ప్రదర్శిస్తున్నారు. లిమిట్ దాటకుండా ఒకరి నుంచి మరొకరికి పంపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల అధికారులు ఈ మార్పును కూడా గమనించి కట్టడికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

### రూ.లక్ష దాటితే లెక్కే..

నిబంధనల ప్రకారం ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో బ్యాంకు ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా ఉంటుంది. బ్యాంకుల్లో రూ.లక్షలకు మించి డబ్బు జమ, ఉపసంహరణకు సంబంధించిన లావాదేవీలు ఉంటే కారణాలను అంతర్గతంగా తనిఖీ చేస్తారు. కరెంట్ అకౌంట్లపై రూ.10 లక్షలకు మించి లావాదేవీలు ఉంటే ఆదాయపు పన్ను శాఖకు నివేదిస్తారు. మరో వైపు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ ) ఆధ్వర్యంలో ఇప్పటికే అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై నిఘా మొదలైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ తరహా లావాదేవీలను గుర్తించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రామాణిక విధానం(స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్) రూపొందించారు. దీని ప్రకారం ఈ–కేవైసీ నిబంధనల ప్రకారం డబ్బు జమ, ఉపసంహరణ, డెబిట్, క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపుల వంటివన్నీ నిశ్చితంగా గమనిస్తారు. చిన్న మొత్తంలో ఎక్కువ సార్లు జరిగే లావాదేవీలను పరిశీలించేలా వ్యవస్థ అందుబాటులో ఉంది. కొందరు నేతలు ఈవిషయం ముందుగానే గ్రహించి స్థానిక నేతలతో ఒప్పందాలు కుదుర్చుకుని పరిమితి దాటకుండా, ఎవరికీ అనుమానం కలగకుండా లావాదేవీలు కనిచ్చేస్తున్నట్లు తెలుస్తోంది.

### జీరో బ్యాలెన్స్ ఖాతాలపై నిఘా

ప్రధానంగా జీరో బ్యాలెన్స్ బ్యాంకు ఖాతాలు, ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలను నిశ్చితంగా పరిశీలిస్తున్నట్లు ఎన్నికల అధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు. ఎన్నికల ముందు వరకు లావాదేవీలు లేకుండా, తర్వాత అనూహ్యంగా పెరిగితే కారణాలు ఆరా తీస్తారు. ఎన్నికల వేళ నగదు లావాదేవీలపై అప్రమత్తంగా వ్యవహరించకుంటే చిక్కులు కొని తెచ్చుకున్నట్లే నని హెచ్చరిస్తున్నారు. అయితే నేతలు మాత్రం ఆన్‌లైన్ చెల్లింపులను తమకు అనుకూలంగా ఎలా మలుచుకోవచ్చో అనుభవజ్ఞుల ద్వారా ఆరా తీస్తూ చెల్లింపులకు యత్నిస్తున్నట్లు సమాచారం.

### లావాదేవీలపై చర్యలు

ఎన్నికల సమయంలో జిల్లాలో ఆన్‌లైన్‌లో జరిగే నగదు లావాదేవీల కట్టడికి అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. గత శాసన సభ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు రెట్టింపు దాటాయి. చిన్న మొత్తాల సొమ్మును గూగుల్ పే, ఫోన్ పే, ఇతర యూపీఐ యాప్‌లతో చెల్లిస్తున్నారు. ముఖ్యంగా ఇప్పటి వరకు సాధారణ లావాదేవీలు జరిగే బ్యాంకు ఖాతాల్లో ఎన్నికల నేపథ్యంలో అనూహ్యంగా నగదు బదిలీలు పెరగడం, పరిమితికి మించి డబ్బు జమ, విత్‌డ్రాలపై నిఘా వేస్తున్నారు. ఇందుకు బ్యాంకులు, పోలీసులు, ఐటీ విభాగం, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

## తండ్రి మందలింపు..

- కొడుకు ఆత్మహత్య

హసన్‌పర్తి: ఆన్‌లైన్‌లో పబ్జీ గేమ్ ఆడుతుండగా తండ్రి మందలించాడు. దీంతో కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హసన్‌పర్తి మండలం పెగడపల్లిలో జరిగింది. ఈ మేరకు మృతుడి తండ్రి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెగడపల్లికి చెందిన మామిడపల్లి రాకేష్(18) నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నాడు. అయితే శుక్రవారం గేమ్స్ ఆడుతుండగా తండ్రి గమనించి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన రాకేష్ పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించి కుటుంబీకులు ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ సీఐ అబ్బయ్య తెలిపారు.

## ఆటో బోల్తా..పలువురికి గాయాలు

కాటారం: కాటారం మండలం గంగారం ఎక్స్ రోడ్డు సమీపంలో ఆదివారం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. మల్హర్ మండలం వల్లెంకుంట నుంచి కాటారం వైపునకు వెళ్తున్న ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వల్లెంకుంటకు చెందిన సుమారు 15 మంది ప్రయాణికులకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సకినాల లచ్చమ్మ, గడ్డం లక్ష్మి, లావణ్య, నల్గొండ, దుర్గమ్మ, మల్లమ్మ, లచ్చమ్మ, ఎర్రమ్మ తీవ్ర గాయాలపాలయ్యారు. మరో ఏడుగురు స్వల్ప గాయాలపాలయ్యారు. లచ్చమ్మ, లక్ష్మి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. స్వల్పగాయాలైన వారు స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నట్లు సమాచారం. తీవ్ర గాయాలపాలైన వారిని కాటారంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. కాగా, బోల్తాపడిన ఆటోలో ఉన్న ప్రయాణికులు కాటారంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు వస్తూ ప్రమాదానికి గురైనట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను అడగగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

# సాక్షి క్లాసిఫైడ్స్

### REAL ESTATE

#### FLATS FOR SALE

- బృందావనం అపార్ట్మెంట్ ఫస్ట్ ఫ్లోర్‌లో 3BHK, 1665 sft ఫుల్ furnished two పార్కింగ్ ఏరియా, స్విమ్మింగ్ పూల్, సూపర్ మార్కెట్ ప్లే ఏరియా, గేటెడ్ కమ్యూనిటీ, ఆల్ facilities అవైలబుల్ వెస్ట్ ఫేస్ గల ఫ్లాట్ అమ్మకం, వడ్డెపల్లి పింగిలి కాలేజ్ దగ్గర. 8886996262. [W-1229310]

### SERVICES

- హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. బిల్డింగ్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి చేయబడును. సెల్: 7842278342, హన్మకొండ. [WA-7245]

### CHANGE OF NAME

- I, EARRAM VIJAY KUMAR, S/o. Earram Gattaiah, R/o. 47-1-377, Shivalayam Street, Paidipally, Warangal, T.S, have changed my Name as Erram Vijaya Kumar, S/o. Erram Gattaiah. [WA-7250]

### సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

- మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-1200951]

### LOSS OF DOCUMENT

- I, DEVA VIJAY KUMAR S/o. DAMODAR, R/o. H.30.45-8-455, Keerthi Nagar Colony, Geesugonda Mandal, Warangal District, T.S. I have lost / misplaced my Original Document bearing Regd. No. 11662/2010 while I was travelling in Bike from Gorrekunta cross to Keerthinagar Colony. If anyone found please inform at the above address and contact number 9059097322. [W-1200963]

### OLD AGE HOME

- ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664/ 8977639665 [H-793653]

### BUSINESS OFFER

- విజయవంతమైన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా రోజుకు 1000 – 5000/– రూ॥ సంపాదించు అవకాశం. ఫోన్: 9440956560. [HA-35479]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/– రూ॥ అదనపు లైను 60/– రూ॥ మాత్రమే 5% GST అదనము

### WANTED

- హన్మకొండ సుబేదారిలోని మా ఆఫీస్‌లో పనిచేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. సాలరీ 8000 నుండి 10000, నియర్ కలెక్టర్ ఆఫీస్, సంప్ర॥ 7780259357. [W-1229314]
- హన్మకొండ, వరంగల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥, 12 గం॥ కలవు. జీతం: 12000/– 16000/–. సెల్: 8688072125. [W-1220871]
- మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర: 9177736926. [G-824711]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221873]

**ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి**

| | |
|---|---|
| హన్మకొండ | 9010144453 |
| వరంగల్ | 9705748198 |
| నర్సంపేట | 9010144453 |
| జనగామ | 9951602871 |
| మహబూబాబాద్ | 9010144453 |
| పరకాల | 9010299096 |
| జయశంకర్ భూపాలపల్లి | 9705748198 |

### గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## క్రీడలతో మానసికోల్లాసం

- ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ శ్రీలక్ష్మి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీఐ శ్రీలక్ష్మి, ఆంటోని, జైకో

కాజీపేట రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ శ్రీలక్ష్మి అన్నారు. కాజీపేట సెయింట్ గాబ్రియల్ స్కూల్ గ్రౌండ్‌లో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న మాంట్‌ఫోర్ట్ స్టేట్ మెగా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఆదివారం రాత్రి ముగిసింది. ఈ కార్యక్రమానికి శ్రీలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ ఆంటోని పొలిశెట్టి మాట్లాడుతూ రెండు రోజులు జరిగిన స్టేట్ స్పోర్ట్స్ మీట్‌లో నాలుగు రాష్ట్రాల నుంచి 15 స్కూళ్లు, సుమారు 2,000 మంది విద్యార్థులు 20 రకాల క్రీడల్లో పాల్గొన్నారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ పి.రవికుమార్, కిట్స్ కాలేజ్ ప్రొఫెసర్ పి.రమేష్‌రెడ్డి, పూణె ప్రావెన్సి రెవరెండ్ బ్రదర్ జైకో గ్రీవెసిస్, బ్రదర్ షాజన్ ఆంటోని, బ్రదర్ విన్సెంట్ రెడ్డి, బ్రదర్ బాల ఇన్న, పీఈటీ పి.విజయ్‌కుమార్, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి



సంగెం కాల్వలో బోల్తా పడిన ట్రాక్టర్



రంజిత్ మృతదేహం

ఖానాపురం : ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన అశోక్‌నగర్ శివారులో శనివారం రాత్రి జరిగింది. ఎస్సై మాధవ్ కథనం ప్రకారం.. అశోక్‌నగర్‌కు చెందిన చింత రంజిత్ (26) గ్రామంలోని ఓ వ్యక్తి వద్ద ఉన్న ట్రాక్టర్‌ను తీసుకుని శనివారం రాత్రి పాకాల శివారులో మట్టి కోసం వెళ్లాడు. సంగెం కాల్వ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి జేసీబీతో మట్టిని ట్రాక్టర్‌లో పోయించుకుని గ్రామానికి తీసుకొస్తున్నాడు. పగిడిద్దుల బుర్ర సమీపంలో గుంతలమయంగా ఉన్న రోడ్డుపై ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న సంగెం కాల్వలో పడిపోయింది. ప్రమాదంలో రంజిత్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి పంచనామా చేశారు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవ్ తెలిపారు.

### ముగ్గురిపై కేసు నమోదు

అటవీ ప్రాంతం నుంచి అనుమతి లేకుండా మట్టి రవాణా చేస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. జేసీబీ యజమాని ప్రశాంత్, డ్రైవర్ వినోద్, జేసీబీని లీజుకు తీసుకున్న మరొకరిపై కేసు నమోదు చేసినట్లు డీఆర్వో మోహన్ పేర్కొన్నారు.

# దోచుకోవడం కాంగ్రెస్ విధానం




విలేకరులతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కడియం

- అసత్యపు ఆరోపణలతో మహిళలను తప్పుదోవ పట్టిస్తున్న ఇందిర
- బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అవినీతి, అక్రమాలు అధికమవుతాయని, దోచుకోవడం, దాచుకోవడం ఆ పార్టీ విధానాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. నేడు మండలంలోని ఛాగల్లు శివారు శివారెడ్డిపల్లిలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఆదివారం కడియం పరిశీలించారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 1 గంటకు సీఎం కేసీఆర్ సభ ఉంటుందని, ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నామని, దాదాపు లక్షమందికి పైగా ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారన్నారు. తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించింది, రాజకీయ భిక్షపెట్టింది ఘన్‌పూర్ నియోజకవర్గమని, కారు గుర్తుకు ఓటువేసి మరోసారి ఆశీర్వదించి రానున్న రోజుల్లో మీకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని ఆయన కోరారు.

### ఆరు గ్యారంటీలు ఏమోగాని.. ఆరుగురు సీఎంలు మారుతారు

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ స్కీంలతో ప్రజలను దగా చేసేందుకు మాయమాటలు చెబుతుందని, తప్పిదారి కాంగ్రెస్‌కు ఓటువేస్తే ఆరు గ్యారంటీలు ఏమోగాని ఐదేళ్లలో ఆరుగురు సీఎంలు మారుతారని కడియం ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేవని, దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందన్నారు. ఐదు గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావాలా, 24 గంటల కరెంటు అందించే బీఆర్‌ఎస్ కావాలా ప్రజలు తేల్చుకోవాలని, కాంగ్రెస్ మాయమాటలు నమ్మి దగా పడవద్దన్నారు.

### మహిళలను తప్పుదోవ పట్టిస్తున్న ఇందిర

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇందిర తనపై అసత్యపు ప్రచారం చేస్తూ నియోజకవర్గ మహిళలను తప్పుదోవ పట్టిస్తుందని కడియం శ్రీహరి అన్నారు. మొదటి నుంచి మహిళలంటే తనకు అమితమైన గౌరవమని, ఆరుగురు అక్కాచెల్లెళ్లు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారన్నారు. తాను వ్యక్తిగత విమర్శలు చేశానని ఆర్‌ఓకు ఫిర్యాదు చేసిందని, అయితే ఎలాంటి సాక్ష్యాలు లేవన్నారు. కేవలం ఓటమి భయంతోనే అనవసర ఆరోపణలు చేస్తున్నారని, ఏమైనా మాట్లాడాలంటే నా అనుభవం, సభ్యత అడ్డువస్తుందన్నారు. ఇందిర నామినేషన్ సమయంలో అఫిడవిట్‌లో సమర్పించిన దాని ఆధారంగానే ఆమెపై చీటింగ్‌కేసు ఉన్నట్లు వ్యాఖ్యానించానని, ఎలాంటి వ్యక్తిగత ఆరోపణలు చేయలేదన్నారు. నా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు చేయలేదని, తనపై చిన్న పిటీ కేసు కూడా లేదన్నారు. చీటికి మాటికి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న ఇందిరపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని, సంబంధించిన సాక్ష్యాలు తన వద్ద ఉన్నాయని, అవసరమైతే లీగల్ నోటీసులు పంపిస్తానని చెప్పారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భువనగిరి ఆరోగ్యం, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సీహెచ్. నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, చేపూరి వినోద్, ఎంపీపీ కందుల రేఖ, బోనగిరి రవీందర్, పోగుల సారంగపాణి, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.



వడ్డెగూడెంలో మాట్లాడుతున్న కడియం దివ్య



బీఆర్‌ఎస్‌లో చేరిన డాక్టర్లతో కడియం శ్రీహరి

### బీఆర్‌ఎస్‌లో చేరిక

ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు అంబటి కిషన్‌రాజ్, అంబటి కార్తీక్‌రాజ్ 75 మందితో స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పాదల రాజేష్, బొమ్మగల్ల విక్రమ్, వినయ్, విజయ్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ

శివునిపల్లికి చెందిన ప్రముఖ వైద్యుడు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మారెడుపాక ఉమాశంకర్ తల్లి మారెడుపాక సరోజన(59) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతిచెందగా విషయం తెలుసుకున్న కడియం శ్రీహరి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, పార్టీ నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, పార్శి కృష్ణారావు తదితరులు ఉన్నారు.

### కడియం శ్రీహరికే మా మద్దతు

ప్రస్తుత ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకేనని, ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపుకోసం కృషి చేస్తామని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ అన్నారు. డివిజన్‌కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్మీరా పూల్‌సింగ్‌నాయక్, భూక్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

### కడియం కుమార్తె ఇంటింటా ప్రచారం

జఫర్‌గఢ్: వడ్డెగూడెంలో కడియం శ్రీహరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కుమార్తె దివ్య ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బానోత్ రాజేష్‌నాయక్, కుల్లా మోహన్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాటికాయల వరుణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కడియం శ్రీహరిని గెలిపించాలని కోరుతూ ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, గుజ్జరి రాజులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

### రఘునాథపల్లి మండలంలో..

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్, ఇబ్రహీంపూర్, అశ్వరావుపల్లిలో శ్రీహరి గెలుపునకు ఆ పార్టీ నాయకులు ఇంటింటా బొట్టు పెడుతూ కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ శాగ నాగరాజు, సర్పంచ్ దొరగొల్ల అయిలమ్మ, యాదగిరి, మధు, లక్ష్మయ్య, మహేందర్, వెంకన్న, ప్రేమ్, కుర్ర కమలాకర్ తదితరులు ఉన్నారు.